
సాక్షి గుంటూరు

సోమవారం । 20 । జనవరి । 2025



గుడికి రూ.5,01,116 విరాళం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం మహంకాళి ఆలయ పునర్నిర్మాణానికి దమ్మాలపాడుకు చెందిన సుబ్బారావు దంపతులు రూ.5,01,116లు విరాళం అందజేశారు.



సాగర్ నీటి మట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 560.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,900 క్యూసెక్కులు విడుదలవుతోంది.



లక్ష్మీకుబేర వ్రతం

కారెంపూడి: షిరిడీ సాయి ఆలయంలో ఆదివారం మహిళలు లక్ష్మీ కుబేర వ్రతాన్ని ఆచరించారు. 108 మంది మహిళలు లక్ష్మీదేవి వ్రతాన్ని ఆచరించారు.


న్యూస్‌రీల్

శివాలయంలో ప్రత్యేక పూజలు



పెదకాకాని: పెదకాకాని శివాలయంలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. జిల్లా నుంచే కాకుండా పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలోని యజ్ఞాల బావి నీటిలో పొంగళ్ళు చేసి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ప్రభలతో వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ఓం నమః శివాయ అని స్మరిస్తూ ప్రదక్షిణలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో అంత్రాలయ అభిషేకాలు, దర్శనాలు, ఏకవారాభిషేక పూజలు, తలనీలాలు సమర్పణ, నామకరణలు, అన్నప్రాసనలు, రాహుకేతు పూజలు, నవగ్రహ పూజలు అధిక సంఖ్యలో జరిగాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 92, బ్యాంక్ కెనాల్‌కు 144, తూర్పు కెనాల్‌కు 206, పశ్చిమ కెనాల్‌కు 107 , నిజాంపట్నం కాలువకు 110, కొమ్మమూరు కాలువకు 666 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

అద్దంకితో విడదీయలేని అనుబంధం

అద్దంకి రూరల్: అద్దంకితో తమ కుటుంబానికి విడదీయలేని బంధం ఉందని టంగుటూరి ప్రకాశం పంతులు ముని మనవరాలు సుభాషిణి అన్నారు. ఆదివారం కుటుంబసమేతంగా ఆమె అద్దంకి వచ్చారు. స్థానిక బంగ్లా రోడ్డులోని ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పించారు. దేశానికి సర్వం అర్పించిన ప్రకాశం పంతులు త్యాగధనుడన్నారు.

(ఇంగ్లిషు విద్యతో) జీవితానికి భరోసా

- మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- శభాష్... పదో తరగతి పిల్లలు
- ఇంగ్లిషు మీడియంలో పరీక్షలకు సిద్ధమవడం అభినందనీయం
- స్వగ్రామంలో 15 ఏళ్లపాటు ట్యూషన్లు చెప్పించాం
- తమ వర్గాల అభ్యున్నతికి అట్టడుగు జాతులూ కృషి చేయాలి
- 'సాక్షి'తో రిటైర్డ్ జడ్జి మోపర్తి ప్రకాశరావు



సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: "చదువు ముఖ్యం. అది మాతృభాషలోనైనా, పరాయిభాషలో అయినా. మాతృభాష స్థానికంగా, ఇంగ్లిషు విశ్వవ్యాప్తంగా అవకాశాలను కల్పిస్తుంది. అందువల్లే ఆంగ్లానికి ప్రాధాన్యం పెరిగింది. జీవితానికి భరోసా తప్పకుండా ఇస్తుంది. నాలాంటి పేదింటి పిల్లలు ఆంగ్లంతో పడిన కష్టాలు ఇతరులకు రాకూడదనే ఉద్దేశంతో పదిహేనేళ్ల పాటు గ్రామస్తుల సహకారంతో మా ఊర్లో ట్యూషన్లు చెప్పించామంటారు" రిటైర్డ్ జూనియర్ సివిల్ జడ్జి మోపర్తి ప్రకాశరావు. "ఆంధ్రప్రదేశ్‌లోని పదో తరగతి విద్యార్థులు 93 శాతం మంది ఇంగ్లిషు మీడియంలో పబ్లిక్ పరీక్షలు రాయడానికి సంసిద్ధతను వ్యక్తం చేయడం సాధారణ విషయం కాదు. వారందరికీ ముందస్తు శుభాకాంక్షలు. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం విద్యకు ఇచ్చిన ప్రాధాన్యానికి ఇదొక నిదర్శనం. నాడు- నేడు ద్వారా విద్యాసంస్థల్లో రూపురేఖలు మార్చడానికి, వసతులు, వనరులు పెరగడానికి, ఉపాధ్యాయుల్లో మరింత నిబద్ధతను పెంపొందించడానికి ఉపకరించిందని" ఆయన అభిప్రాయపడ్డారు.

మోపర్తి ప్రకాశరావు మాటల్లో..

"మాది పూర్వపు గుంటూరు జిల్లా అమర్తలూరు మండలం బోడపాడు గ్రామం. నా వయసు ఇప్పుడు 83. జూనియర్ సివిల్ జడ్జిగా 23 ఏళ్ల కిందట రిటైరయ్యాను. తెనాలి చుట్టుపక్కల ప్రాంతాల వారు విద్య ప్రాధాన్యాన్ని గుర్తెరిగిన వారు. పేద కుటుంబానికి చెందిన నాకూ చదువుకునే అవకాశాన్ని తల్లిదండ్రులు కల్పించారు. మాతృభాషలో విద్యనభ్యసించిన నేను ఇంగ్లిషులో కనీస ప్రావీణ్యతకు కుస్తీ పట్టక తప్పలేదు. ఆ దృష్ట్యానే బిడ్డలకు ఇంగ్లిషు చదువుల అవసరాన్ని గుర్తించాను. ఆంగ్లంలో చదువుకుంటే అంతర్జాతీయంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయనడంలో సందేహం లేదు.

నేటి పరిస్థితులు వేరు..

పూర్వం ప్రభుత్వ బడులలో ఉపాధ్యాయులు బాధ్యతగా చదువు చెప్పేవారు. అందుకు ప్రధాన కారణం ప్రైవేటు బడులు లేకపోవడం. ఉన్నత వర్గాల వారి పిల్లలు ఆ బడుల్లోనే చదువుకోవాల్సిన తప్పని పరిస్థితి. దీంతో గ్రామాల్లోని మోతుబరులు, అగ్రవర్ణాల వారు పంతుళ్లు చదువులు ఎలా చెపుతున్నారనే దానిపై ఓ కన్నేసి ఉంచేవారు. వారి పిల్లలతోపాటు నాలాంటి పేదింటి పిల్లలకు కూడా చదువు అబ్బేది. ప్రైవేటు కాన్వెంట్లు వచ్చాక గవర్నమెంట్ బడుల స్థితిగతులు మారాయి. ప్రభుత్వాలు అంతగా దృష్టి పెట్టలేకపోయాయి.

పే బ్యాక్ టు సొసైటీ..

"అంబేడ్కర్ ఆశయాల మేరకు, ఆయన పిలుపు ప్రకారం ప్రతి ఒక్కరూ సొసైటీకి తిరిగి ఇచ్చేయాలి (పే బ్యాక్ టు సొసైటీ). ప్రతి గ్రామంలో, ప్రతి ప్రాంతంలో చదువుకున్న వారు, ఉద్యోగాలు చేసే వారు, రిటైర్ అయిన వారుంటారు. ఎవరంతట వారు, తమ ఆదాయంలో ఒకటి, రెండు శాతం పేద పిల్లలకు మెరుగైన చదువు చెప్పించటానికి వెచ్చించగలిగితే మంచిది. అదే సమాజానికి వారు చేసే పెద్ద మేలవుతుంది. విద్య ఉంటే మెజార్టీ వ్యక్తుల్లో మంచి మాట, ప్రవర్తన, జీవనం ఉంటుంది. వ్యసనాలు దరిచేరవు. తనతోపాటు కుటుంబం, తద్వారా సమాజం బాగుపడుతుంది. మా వరకు దాదాపు పదిహేనేళ్లపాటు పొన్నూరు నుంచి మాస్టర్లను పిలిపించి బోడపాడులోని ప్రైమరీ, హైస్కూల్ విద్యార్థులకు ప్రైవేటుగా ట్యూషన్లు చెప్పించాం. కరోనా వల్ల ఆ ప్రక్రియ ఆగింది. ఇప్పుడేమో వయసు పెరిగినందున హైదరాబాద్ వచ్చా. అయినా పొన్నూరు, చీరాల నుంచి మాస్టర్లను పిలిపించి కనీసం ఇంగ్లిషు, మ్యాథ్స్ సబ్జెక్టులకు ట్యూషన్లు చెప్పించాలనే ఆలోచనల్లో ఉన్నాం. ఎంతవరకు సాధ్యమో చూడాలి. విద్యావంతులు పల్లెల వైపు దృష్టి సారించాలి, వాటి బాగుకు యత్నించాలని" అభిప్రాయం వ్యక్తం చేశారు మోపర్తి ప్రకాశరావు.

జగన్ పేదింటి పిల్లల అవసరాలను గుర్తించారు..

"తన సుదీర్ఘ పాదయాత్రలో పేదల స్థితిగతులను, వారి అవసరాలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టంగా గుర్తించారు. బహుశా అందుకే విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేకంగా దృష్టి సారించారనిపిస్తుంది. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిషు విద్య అవసరాన్ని గుర్తించే ప్రాధాన్యమిచ్చారు. సజావుగా ఆలోచించే టీచర్లు తమ బాధ్యతలను గుర్తించి పనిచేశారు. ఆ ఫలితమే ఈ దఫా 93 శాతం మంది పదో తరగతి విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో పరీక్షలకు సంసిద్ధత వ్యక్తం చేయడం. ప్రస్తుత ప్రభుత్వం కూడా పేద పిల్లల బాగు కోసం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది."

జీజీహెచ్‌లో పలువురిపై చర్యలు

- ఆస్పత్రి సిబ్బందిలో ఆందోళన
- రిక్రూట్‌మెంట్‌లో నిబంధనలు పాటించలేదని ఫిర్యాదులు
- విచారణ చేసి చర్యలకు ఆదేశించిన డీఎంఈ కార్యాలయం



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ చింతలపూడి నాగేశ్వరావుపై ఆరోపణలు రావడంతో విచారణ చేసిన అనంతరం ఆస్పత్రిలోని పలువురు కార్యాలయ అధికారులు, కార్యాలయ సిబ్బందిపై చర్యలకు ఆదేశాలు జారీ అయ్యాయి. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) కార్యాలయం నుంచి గుంటూరు జీజీహెచ్‌కు ఉత్తర్వులు రావటంతో ఆస్పత్రి కార్యాలయ అధికారులు, ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.

ఫిర్యాదుతో విచారణ

2023లో గుంటూరు జీజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ చింతలపూడి నాగేశ్వరరావుపై గుంటూరుకు చెందిన డీఎస్‌బీ కోటేశ్వరరావు పలు ఆరోపణలు చేస్తూ లిఖితపూర్వకంగా డీఎంఈ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. డైట్ కాంట్రాక్ట్ ఫైల్ మాయం చేశారని, ముఖ్యంగా కరోనా డైట్ ఫైల్ మాయమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు, ఇతర వైద్య సిబ్బంది రిక్రూట్‌మెంట్ నియామకాల్లో నిబంధనలు పాటించలేదని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఎక్కువ మొత్తంలో చెల్లించారని, కొంత మందికి మాత్రమే ఇలా చెల్లించి మిగతావారిపై వివక్ష చూపించారని, నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో రిక్రూట్‌మెంట్‌లో నిబంధనలు పాటించలేదని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులపై డీఎంఈ కార్యాలయం అధికారులు మూడుసార్లు ఇతర జిల్లాలకు చెందిన అధికారులను కమిటీగా నియమించి విచారణ చేయించారు. ఈ అధికారులు.. జీజీహెచ్‌కు వచ్చి కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ చింతలపూడి నాగేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్స్ వై.లక్ష్మీ సామ్రాజ్యం, ఎ.గోపీనాథ్, జి.మనోరమ, ఫిర్యాదు చేసిన కోటేశ్వరరావులను విచారించి డీఎంఈకి నివేదిక ఇచ్చారు. నివేదిక ప్రకారం డీఎంఈ కార్యాలయం తదుపరి చర్యలు తీసుకుంది. ఆ మేరకు గుంటూరు జీజీహెచ్ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఆస్పత్రి అధికారులకు పలు సూచనలు చేసింది.

ఇకపై సెలక్షన్ కమిటీ..

ఇక నుంచి ఆస్పత్రిలో చేసే ఉద్యోగ నియామకాలన్నీ తప్పనిసరిగా జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా మాత్రమే చేపట్టాలని డీఎంఈ కార్యాలయం తెలిపింది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అధిక మొత్తంలో వేతనాలు చెల్లించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, స్టాఫ్ నర్సు రిక్రూట్‌మెంట్‌లో నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని, కరోనా డైట్ ఫైల్ మాయం చేసిన ఎల్.శ్రీనివాసరావుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డీఎంఈ కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. జీజీహెచ్‌లో ఎమ్మారై స్కానింగ్ కాంట్రాక్టర్ ఆర్‌కే డయాగ్నోస్టిక్ ప్రైవేట్ లిమిటెడ్, క్యాథ్‌ల్యాబ్ కాంట్రాక్టర్ లక్ష్మీతేరుష్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ వారి వద్ద నుంచి విద్యుత్ బిల్లులను 30 రోజుల్లోగా వడ్డీ సహా తీసుకోవాలని ఆదేశించారు. అసిస్టెంట్ డైరెక్టర్ చింతలపూడి నాగేశ్వరరావుపై వచ్చిన ఆరోపణలను విచారించిన జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారి డి.మనోరమ విచారణ నివేదికను అందజేయాలని ఆదేశించారు. దీంతో ఆస్పత్రిలో పనిచేస్తున్న పలువురు కార్యాలయ అధికారులు, ఉద్యోగులు ఎవరిపై వేటు పడుతుందో అనే భయాందోళనలో ఉన్నారు. కాగా డీఎంఈ కార్యాలయం ఉత్తర్వులపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణను 'సాక్షి' వివరణ కోరగా.. తమ కార్యాలయానికి ఇంకా ఉత్తర్వులు రాలేదని, అందిన వెంటనే డీఎంఈ ఆదేశాల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

'జనరల్ బోగీలు'కు బహుమతుల పంట

తెనాలి: 'జనరల్ బోగీలు' నాటిక ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి పరిషత్ పోటీల్లో పలు బహుమతులను కైవసం చేసుకుంది. రూరల్ మండల గ్రామం కొలకలూరుకు చెందిన ప్రముఖ నాటక సమాజం శ్రీసాయి ఆర్ట్స్ వారు దీనిని ప్రదర్శించారు. బాపట్ల జిల్లా చిలకలూరిపేటకు దగ్గర్లోని అనంతవరంలో ఇటీవల జరిగిన ఎన్టీఆర్ కళాపరిషత్ నాటికల పోటీల్లో ఉత్తమ ప్రదర్శన బహుమతి లభించింది. ఇందులో ప్రధాన పాత్రధారిణి సురభి ప్రభావతికి ఉత్తమ నటి, సీఐ పాత్రలో నటించిన గోపరాజు విజయ్, కానిస్టేబుల్ పాత్రను పోషించిన కె.నాగేశ్వరరావుకు ఉత్తమ సహాయనటుడు బహుమతులు వచ్చాయి. ఉత్తమ రచనకుగాను పీటీ మాధవ్‌కు బహుమతి వచ్చింది. రైలులో జనరల్ బోగీలు ప్రమాదానికి గురైతే సాధారణ ప్రయాణికులు, వారి కుటుంబాలు పడే ఇబ్బందులే ఇతివృత్తంగా రూపొందిన ఈ నాటికకు గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు.



ఉత్తమ ప్రదర్శన విభాగంలో బహుమతిని స్వీకరిస్తున్న నాటక బృందం

బిడ్డ సహా తల్లి ఆత్మహత్య

లక్ష్మీపురం: విజయవాడ - చెన్నై జాతీయ హైవే సమీపంలోని బుడంపాడు వద్ద రైలు పట్టాలపై గుర్తు తెలియని మహిళ తన బిడ్డ సహా ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుడంపాడు వద్ద రైలు పట్టాలపై ఓ మహిళ, పసి బిడ్డ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం వచ్చింది. ఎస్సై లక్ష్మీనారాయణరెడ్డి సిబ్బందితో చేరుకున్నారు. వారి వివరాలు తెలియరాలేదు. మృతదేహాలను ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు గుంటూరు జీఆర్పీ ఎస్సైని 83280 18787, పోలీస్ స్టేషన్‌ను 0863-222073 ఫోను నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.





రైలు పట్టాలపై మృతదేహాలు

ఆత్మీయత చాటిన స్వర్ణ సంబరం



పూర్వ విద్యార్థుల బృంద చిత్రం

- దేశ విదేశాల నుంచి వైద్యులు హాజరు
- రూ.50 లక్షల విరాళం ప్రకటన

గుంటూరు మెడికల్ : గుర్తుకొస్తున్నాయి... ఎద లోతులో ఏ మూలనో నిదురించు జ్ఞాపకాలు నిద్ర లేస్తున్నాయి.. అంటూ గుంటూరు వైద్య కళాశాలలో అడుగుపెట్టగానే ఆరు పదులు దాటిన సీనియర్ వైద్యులంతా ఆనాటి ఘటనలను నెమరువేసుకున్నారు. 50 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న స్నేహితులను నేడు కళ్లారా చూసి పలువురు తమ స్నేహ మధురిమలు పంచుకున్నారు. గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో చేరి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న 1975 ఫిబ్రవరి బ్యాచ్ వైద్యులు తమ స్వర్ణోత్సవాలను అంగరంగ వైభవంగా జరుపుకొన్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, దుబాయ్ వంటి విదేశాల్లో స్థిరపడి పేరు ప్రఖ్యాతులు గాంచిన వైద్యులుగా సేవలందిస్తున్న వారు రీయూనియన్ పేరుతో గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో ఆదివారం కలిశారు. కాలేజీలోకి అడుగుపెట్టగానే వారంత కుర్రకారు మాదిరిగా ఉరకలెత్తారు. తరగతి గదుల్లో కలియతిరిగి తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నిక్‌నేమ్‌లతో పిలుచుకున్న పిలుపులు... ఒక్కొక్కరు గుర్తు పట్టలేని విధంగా ఎలా మారిపోయారో అని ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఆలింగనం చేసుకున్నారు. బ్యాచ్‌లో 150 మందికిగాను సుమారు 20 మంది అకాల మృత్యువుకు గురయ్యారు. తోటి స్నేహితులను తలచుకుని వారికి నివాళులు అర్పించారు. సుమారు 105 మంది వైద్యులు తమ కుటుంబాలతో హాజరై సందడి చేశారు. పండుగలా ఒకే చోట కూర్చుని విందు భోజనాలు చేసి ఆనందంగా గడిపారు.

ప్రత్యేకమైన బ్యాచ్ ఇది...

గుంటూరు వైద్య కళాశాలలో ఒకే ఏడాది రెండు ఎంబీబీఎస్ బ్యాచ్‌లు చదివిన ప్రత్యేకత 1975 బ్యాచ్‌కు ఉంది. ఎంబీబీస్ ప్రవేశాలకు కనీస వయస్సు 17 ఉండాలని నిబంధన పెట్టడంతో ఈ బ్యాచ్ వారు కోర్టుకెళ్లారు. అనేక మంది 16 సంవత్సరాలు నిండిన వారు ఎంట్రన్స్‌లో ఉత్తీర్ణులై సీట్లు సాధించారు. కోర్టుకు వెళ్లటంతో 1974లో ఎంట్రన్స్ రాసిన వారు 1975 ఫిబ్రవరిలో గుంటూరు వైద్య కళాశాలలో చేరారు. రెగ్యులర్‌గా 1975లో నవంబర్‌లో ఒక బ్యాచ్ వారు కూడా చేరారు. కోర్టుకు వెళ్లి సీట్లు తెచ్చుకున్న బ్యాచ్‌గా ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ బ్యాచ్‌కు చెందిన సీనియర్ మత్తువైద్య నిపుణులు డాక్టర్ తన్నీరు వేణుగోపాలరావు గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా, హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌గా పనిచేశారు. మరో వైద్యురాలు డాక్టర్ శైలబాల గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా విధులు నిర్వర్తించారు. ఒకే బ్యాచ్‌కు చెందిన ఇరువురు వైద్యులు ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా, వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేసి రికార్డు సృష్టించారు. ప్రముఖ గుండె శస్త్ర చికిత్స నిపుణులు పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ గోపీచంద్, రమేష్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ పోతినేని రమేష్‌బాబు, డాక్టర్ లోకేశ్వరరావు, డాక్టర్ బైరపనేని రమేష్‌లు ఈ బ్యాచ్‌కు చెందిన వారే. రీ యూనియన్‌కు ఐఎంఏ గుంటూరు మాజీ అధ్యక్షుడు డాక్టర్ గద్దం విజయసారథి, డాక్టర్ చేబ్రోలు విశ్వేశ్వరరావులు కన్వీనర్స్‌గా వ్యవహరించారు. డాక్టర్ సీతారామా, డాక్టర్ పెద్దిప్రసాద్‌లు యాక్టివ్ మెంబర్స్‌గా పనిచేశారు.




గురువును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

గురువులకు సన్మానం....

తమకు విద్యాబోధన చేసి తమ ఉన్నత స్థితికి కారణమైన సీనియర్ వైద్యులను 1975 బ్యాచ్ వైద్యులు ఘనంగా సన్మానించారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, అనాటమి ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు, ఎస్‌పీఎమ్ ప్రొఫెసర్ డాక్టర్ శివరామప్రసాద్‌లను సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు. వీరితోపాటుగా గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగార్జున కొండ వెంకట సుందరాచారిని కూడా సన్మానించారు. తమ బ్యాచ్ స్వర్ణోత్సవాలకు గుర్తుగా రూ.50 లక్షలు విరాళంగా ఇవ్వాలని నిర్ణయించినట్లు రీ యూనియన్ కన్వీనర్ డాక్టర్ గద్దం విజయసారథి ప్రకటించారు. వీలైతే అంతకంటే ఎక్కువ మొత్తంలో వైద్య కళాశాల అభివృద్ధికి ఇస్తామని వెల్లడించారు.

SUNDARAM HOME
— Sundaram Finance Group —

అఫర్డబుల్ హోమ్ లోన్స్ (అనుకూలమైన గృహ రుణాలు) మరియు చిన్న వ్యాపారాలకు తనఖా రుణాల కోసం మా ప్రత్యేక శాఖ



గుంటూరులో ఈరోజు శుభారంభం!

బ్రాంచి చిరునామా:
సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్,
డోర్ నెం: 6-9-9, మొదటి అంతస్తు, 9వ లేన్,
2వ క్రాస్, అరండేల్‌పేట్, గుంటూరు - 522 002.
ఫోన్: 99630 18422

- న్యాయమైన వడ్డీ
- పారదర్శకమైన ప్రక్రియలు
- త్వరిత ఆమోదం
- ఇబ్బందులులేని సులువైన విధానాలు
- ప్రత్యేకమైన సేవలు

గృహ రుణాల కోసం మా గుంటూరు బ్రాంచి:
సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్,
డోర్ నెం: 6-9-9, మొదటి అంతస్తు, 9వ లేన్, 2వ క్రాస్, అరండేల్‌పేట్,
గుంటూరు - 522 002.
ఫోన్: 97908 00700 www.sundaramhome.in

క్లుప్తంగా

విద్యార్థినికి మంత్రి లోకేష్ అభినందన



మంగళగిరి (తాడేపల్లి రూరల్): తెలుగు టైప్‌రైటింగ్ లోయర్ గ్రేడ్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థినిని మంత్రి లోకేష్ అభినందించారు. స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించిన పరీక్షలో ఆమె ఈ ఘనత సాధించింది. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెంకు చెందిన ఆరాధ్యుల హరితసాయి నగరానికి చెందిన టైప్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపల్ మురళీతో కలిసి తాడేపల్లిలోని నారా లోకేష్ నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను మంత్రి అభినందించారు.

'మా - ఏపీ' గుర్తింపు కార్డులు జారీ



తెనాలి: మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ – ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ (మా–ఏపీ)లో ఆదివారం వివిధ రంగాలకు చెందిన సినీ రంగ కార్మికులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ.. గతంలో ఏ శాఖలో ఎవరి దగ్గర పనిచేశారో ఆయా రంగాల సాంకేతిక నిపుణులు ఇచ్చిన అనుభవం సర్టిఫికెట్ల ఆధారంగా గుర్తింపు కార్డులను అందజేస్తున్నట్టు తెలిపారు. కార్డులను అందుకున్న వారిలో కాస్ట్యూమ్ డిజైనర్లు పట్నాల పార్వతి, శ్రీవిద్య, ఫైటింగ్ డివిజనులో శ్రీధర్, కెమెరామెన్ రాజు తదితరులున్నారు.

ఫొటోగ్రఫీలో బాలాజీకి బహుమతి



వేటపాలెం: స్థానిక స్టార్ స్టూడియో నిర్వాహకుడు బాలాజీ మోహన్ కృష్ణకు అమరావతి అనే సబ్జెక్టుపై తీసిన ఫొటోకి ప్రత్యేక బహుమతి లభించింది. ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో అమరావతిపై ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించారు. శనివారం విజయవాడలోని బాలోత్సవ్ భవనంలో జరిగిన కార్యక్రమంలో బాలాజీ బహుమతి అందుకున్నారు.

'కోత'ల పాలనలో రైతులకు షాక్!

కూటమి సర్కారు కేవలం 'కోత'లకే పరిమితమైంది. మాటలు చెప్పడంలో ఆరితేరిన పాలకులు.. ప్రజలకు ఉపయోగపడే అంశాల్లో మాత్రం విఫలమయ్యారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కొనసాగుతున్న లబ్ధిని కూడా ప్రజలకు దూరం చేస్తోంది కూటమి సర్కార్. ఇదే కోవలో రైతులకు నిరంతరాయంగా పగలు 9 గంటలు విద్యుత్తు ఇవ్వడంలో చేతులెత్తేసింది. దీంతో రైతాంగం తీవ్ర ఆవేదనకు గురవుతోంది.

- వ్యవసాయ విద్యుత్ సరఫరా సమయాన్ని కుదించిన కూటమి సర్కార్
- ప్రస్తుతం ఏడు గంటలే సరఫరా
- క్రమక్రమంగా తగ్గిస్తూ వస్తున్న వైనం
- పంటల నీటి తడులకు తప్పని ఇబ్బందులు
- మున్ముందు పరిస్థితిపై అన్నదాతల్లో ఆందోళన
- పగలు 9 గంటలు నిరంతరాయ సరఫరాకు డిమాండ్



మొక్కజొన్న పంటకు నీటి తడి అందించటానికి వచ్చి విద్యుత్ సరఫరా లేకపోవటంతో ఎదురు చూస్తున్న కూలి

కొల్లిపర: తెనాలి నియోజకవర్గంలో రబీ సాగులో రైతులు మొక్కజొన్న, జొన్న పసుపు, అరటి కూరగాయలు వంటి పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఆయా పంటలకు నీటి తడులలో నిమగ్నమయ్యారు. ఈ సమయంలో విద్యుత్ వెతలు వెంటాడుతున్నాయి. తొమ్మిది గంటలు ఇచ్చే వ్యవసాయ విద్యుత్ సరఫరాను గత మూడు రోజుల నుంచి ఏడు గంటలకు ఆ శాఖ కుదించింది. దీంతో అవసరమైన నీటి తడులు ఇవ్వటానికి అన్నదాతలు నానా అగచాట్లు పడుతున్నారు. మొక్కజొన్న, జొన్న వంటి పంటలు ఎదుగుదల దశలో నీటి తడులు సమయానికి ఇవ్వకపోతే పంట దిగుబడులపై ఎక్కువ ప్రభావం చూపుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

తెనాలి నియోజకవర్గంలో ఇలా....

తెనాలి నియోజవర్గంలో తెనాలి మండలంలో జొన్న 7323, మొక్కజొన్న 5742, పప్పు ధాన్యాలు 2280, పసుపు 30, దుగ్గిరాల మండలంలో జొన్న 4000, మొక్కజొన్న 11000, పప్పు ధాన్యాలు 4000, పసుపు 100, కొల్లిపర మండలంలో జొన్న 6450, మొక్కజొన్న 7150, పసుపు 1450 ఎకరాలలో సాగు చేస్తున్నారు. వీటితోపాటు కూరగాయలు, అరటి వంటి వివిధ పంటలు వేశారు. ప్రస్తుతం రబీలో సాగు చేస్తున్న పంటలన్నీ వివిధ దశల్లో ఉన్నాయి. విద్యుత్ కోతతో పంటలకు నీటి తడులు అందించే సమయంలో సరైన విద్యుత్ లేకపోవడంతో పంట దిగుబడికి ఇబ్బందులు తప్పవని రైతులు వాపోయారు. కూలీలకు రూ.800 ఇచ్చి పెట్టుకున్నా పని కావడం లేదన్నారు. ఒక రోజుతో అయిపోయే పనికి మరొక రోజు పెట్టుకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఇలా...

దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఉచిత విద్యుత్ ఇచ్చి వ్యవసాయాన్ని రాష్ట్రంలో పండుగ చేశారని. దీంతో తెనాలి, కొల్లిపర మండ భూములలో రెండు పంటలు పండించుకోగలిగామని రైతులు అంటున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో కూడా పగటి పూట 9 గంటల విద్యుత్ ఎటువంటి ఆటంకులు లేకుండా, కరోనా సమయంలో కూడా సరఫరా చేశారని గుర్తుచేస్తున్నారు. రెండు పంటలతో ఆదాయాన్ని గడించి రైతులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సాగులో అడుగడుగునా ఇబ్బందులు తప్పడం లేదన్నారు. పెరిగిన ఎరువులు ధరలు, అందని పెట్టుబడి సాయం వంటి కష్టాలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వ అలసత్వ ధోరణి కారణంగా తొమ్మిది గంటలు సరఫరా అయ్యే విద్యుత్‌ను ఏడు గంటలకు కుదించటంతో పంటల పరిస్థితి ఆందోళనకరంగా మారిందిని ఆవేదన చెందుతున్నారు. చంద్రబాబు సర్కారు వ్యవసాయానికి పూర్తిస్థాయిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు 9 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాలతో తగ్గించాం

సౌర విద్యుత్ ఉత్పత్తి తగ్గడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యవసాయానికి రెండు గంటలు విద్యుత్ సరఫరాను తగ్గించాం. మళ్లీ ఉత్పత్తి పెరిగిన తర్వాత 9 గంటల సరఫరా పునరుద్ధరిస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. త్వరలోనే కోతలు లేకుండా అందించడానికి చర్యలు తీసుకుంటాం.

– ప్రదీప్ కుమార్, విద్యుత్ ఏఈ

ప్రభుత్వం తీరు దారుణం



వ్యవసాయ ఉచిత విద్యుత్‌పై రెండు గంటలపాటు కోత విధించడం దారుణం. దీంతో పంటలకు నీటి తడులు ఇబ్బంది పడుతున్నాం. అదనంగా ఖర్చు పెరుగుతోంది. జొన్న, మొక్కజొన్న ఎదుగుదల దశలో ఉన్నాయి. ఈ సమయంలో పంటలకు ఎరువులు, నీరు అందించాలి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నాణ్యమైన విద్యుత్‌తో పాటు 9 గంటలు నిరంతరాయంగా సరఫరా చేశారు. కరోనా సమయంలో కూడా ఆటంకాలు లేవు. అప్పుడు లేని కోతలు ఇప్పుడు ఎందుకు? కూటమి ప్రభుత్వం వెంటనే 9 గంటలు విద్యుత్ ఇవ్వాలి.

– మర్రెడ్డి కిషోర్‌రెడ్డి, తూములూరు, రైతు

పసుపు రైతులకు పరిహారం చెల్లించాలి

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్నిబాధిత పసుపు రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని ఏపీ పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దుగ్గిరాల గ్రామంలో ఆదివారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అగ్నిప్రమాదంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, పరిహారం చెల్లించాలని అనేక ఉద్యమాలు నిర్వహించినట్లు తెలియజేశారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం క్వింటాకు రూ.7 వేల నష్టపరిహారం ఇస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఇవ్వకపోవడంతో బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. ఇప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

వేంకటేశ్వరశర్మకు జాతీయ పురస్కారం

అచ్చంపేట: గింజుపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ అర్చక ఆధ్యాత్మిక పండితులు రెంటాల వేంకటేశ్వరశర్మ ఆర్వాణి సకల కళావేదిక, కరీంనగర్‌వారు జాతీయ పురస్కారానికి ఎంపిక చేశారు. కరీంనగర్‌లో ఆదివారం జరిగిన పురస్కార సభలో ఆర్వాణి సకల కళావేదిక ప్రతినిధి డాక్టర్ దూడపాక శ్రీధర్ నుంచి పురస్కారాన్ని అందుకున్నారు. వేంకటేశ్వరశర్మ మాట్లాడుతూ తన తండ్రి సత్యనారాయణ ద్వారా అర్చక ఆధ్యాతిక జ్యోతిష్య రంగాన్ని వారసత్వంగా పొందానన్నారు. ఈ రంగాలలో తాన చేసిన కృషిని గుర్తించిన ఆర్వాణి సకల వేదిక ప్రముఖులు 2025 సంక్రాంతి జాతీయ ప్రతిభాపురస్కారానికి ఎంపిక చేశారన్నారు. వారి చేతులమీదుగా పురస్కారాన్ని అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత వేంకటేశ్వరశర్మను మాదిపాడు, గింజుపల్లి గ్రామా ల వైఎస్సార్ సీపీ ప్రముఖులు సర్పంచ్ మాదా ఈశ్వరమ్మ, వారి భర్త వెంకట్రావు, ఎంపీటీసీ భూక్యా స్వర్ణ మ్మ వారి భర్త రమేష్‌నాయక్, జిల్లా ఆర్యవైశ్య ప్రముఖులు దేవరశెట్టి శ్రీనివాసరావు, ఆర్ఎంపీ వైద్యులు షేక్ కరీం, కొరివి వెంకటనరేష్, చిట్యాల దావీదు తదితరులు అభినందించారు.

లౌకిక శక్తులు ఏకం కావాలి

ఆవాజ్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



నినాదాలు చేస్తున్న చిష్టి, నళినీ కాంత్, జిల్లా కమిటీ సభ్యులు

లక్ష్మీపురం: కేంద్రం వైఖరిపై పోరాటానికి లౌకిక శక్తులు ఏకం కావాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిష్టి అన్నారు. పాత గుంటూరులోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఆవాజ్ కమిటీ గుంటూరు జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు బాషా అధ్యక్షతన జరిగింది. ఇందులో చిష్టి మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా మైనారిటీలకు ఇచ్చిన ప్రత్యేకమైన హామీలు, సూపర్ 6 అమలు కోసం గట్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు నళినీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో చాపకింద నీరులా జనసేనను అడ్డుపెట్టుకొని బీజేపీ తన మతోన్మాద ఎజెండాను అమలు పరచాలని చూస్తోందని ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. అంబేడ్కర్‌ను అవమాన పరుస్తూ అమిత్ షా పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగం పట్ల వారి వైఖరి, మతోన్మాదంపై వారి నిబద్ధతకు నిదర్శనమన్నారు. ప్రస్తుతం రాజ్యాంగమే ప్రమాదంలో పడిందని చెప్పారు. దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశంలో ప్రతి పౌరుడికి ఉందన్నారు. చట్టసభల్లో సామాన్యుల గొంతుకగా ఉన్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు తిరిగి గెలిపించుకోవాలని కోరారు. అనంతరం 12 మందితో ఏర్పాటైన నూతన కమిటీకి అధ్యక్ష, కార్యదర్శులుగా సుభాని, బాషాలను ఎన్నుకున్నారు.

'సోషల్' చెర వీడనుందా?!

- తల్లిదండ్రుల అనుమతి ఉంటేనే ఇక మైనర్లకు సోషల్ మీడియా ఖాతాలు
- కేంద్ర ప్రభుత్వం తెచ్చిన డీపీడీపీ ముసాయిదాలో నిబంధన
- అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఫిబ్రవరి 18 వరకు గడువు

పట్నంబజారు : సోషల్ మీడియాలో ఇకపై మైనర్లు (18 ఏళ్లలోపు పిల్లలు) ఇష్టం వచ్చినట్లు ఖాతాలు తెరిచేందుకు వీలుండదు. తల్లిదండ్రుల అనుమతి (వెరిఫయబుల్ కన్సెంట్) ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. కేంద్ర సమాచారశాఖ విడుదల చేసిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) చట్ట ముసాయిదాలో ఈ మేరకు నిబంధన చేర్చారు. ఈ బిల్లు చట్ట రూపం దాల్చితే తల్లిదండ్రులు, గార్డియన్ అనుమతి ఇచ్చిన తర్వాతే మైనర్లు సోషల్ మీడియా ఖాతాలు, ఈ–కామర్స్, గేమింగ్ యాప్‌లు వాడాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో కొందరు తమ పుట్టిన తేదీ, వయస్సును తప్పుగా నమోదు చేసి సోషల్ మీడియా ఖాతాలు తెరుస్తున్నారు. తద్వారా అనేక పరిణామాలు, దుష్ప్రభావాలు వారిపై పడుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఇకపై ఇది కుదరదు. పిల్లలకు తల్లిదండ్రులుగా సమ్మతి తెలిపే వారు కూడా తప్పకుండా పెద్దవాళ్లే అని నిర్ధారించాల్సి ఉంటుందని ముసాయిదాలో పేర్కొన్నారు. దివ్యాంగులకు సైతం వారి చట్టబద్ధమైన గార్డియన్ ద్వారా సమ్మతి ఉండాల్సిందే. కొత్త నిబంధనలు మెటా, గూగుల్, యాపిల్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి టాప్ సోషల్ మీడియా, ఈ కామర్స్ కంపెనీలకు ఇబ్బంది కలిగించే అవకాశాలు లేకపోలేదు. ఈ ముసాయిదాపై అభిప్రాయాలు తెలిపేందుకు ఫిబ్రవరి 18 వరకు కేంద్ర ప్రభుత్వం గడువు ఇచ్చింది. సదరు కంపెనీలు ఈ నిబంధనలు వ్యతిరేకించే అవకాశాలు ఉన్నాయి.

దూరంగా ఉంచేందుకు...

ప్రస్తుత సాంకేతిక యుగంలో స్మార్ట్ ఫోన్ వాడకం ఒక భాగమైంది. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ప్రయాణాలు, లావాదేవీలు, షాపింగ్‌లో పిల్లల నుంచి పెద్దల వరకు సెల్‌ఫోన్ వాడుతూనే ఉన్నారు. ఇటీవలి కాలంలో చిన్నారులు గంటలకొద్దీ సోషల్ మీడియాలో గడుపుతున్నారని, దీని వల్ల వారిపై విపరీతమైన ప్రభావం పడుతోందని వైద్యులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అంతే కాకుండా వారి డేటా ఉల్లంఘనలపైనా ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనలు నెలకొన్నాయి. ఈ క్రమంలో చిన్నారులను ఇంటర్నెట్‌కు, అందులోనూ ముఖ్యంగా సోషల్ మీడియాకు దూరంగా ఉంచేందుకు ఇటీవల కొన్ని దేశాలు చర్యలు తీసుకున్నాయి. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలకు సన్నద్ధం అయ్యింది. ఈ చర్యల్లో భాగంగా డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ రూల్స్ –2025కు సంబంధించిన ముసాయిదా నిబంధనలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది.

18 తరువాత కేంద్రం పరిశీలన...

ప్రజలు ముసాయిదాపై మైగవ్.ఇన్ వెబ్‌సైట్‌లో ప్రజలు తమ అభ్యంతరాలు, సూచనలు పంపవచ్చని కేంద్రం పేర్కొంది. ఫిబ్రవరి 18వ తేదీలోగా వచ్చిన వాటిని పరిశీలించనుంది. వాటి ఆధారంగా ముసాయిదాలో మార్పుచేర్పులు చేసి చట్టాన్ని తీసుకురానుంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఈ మేరకు పేర్కొంది. సోషల్ మీడియాలను నిర్వహించే సంస్థలు చిన్నారుల వ్యక్తిగత డేటాను వాడుకోవాలన్నా, భద్రపరుచుకోవాలన్నా తల్లిదండ్రుల సమ్మతి పొందాలి. ఈ ముసాయిదాలో వినియోగదారునికి అనుకూలంగా పలు కీలక అంశాలు ఉన్నాయి. డేటా సంరక్షణపై వినియోగదారులకు పూర్తి నియంత్రణ ఉంటుంది. సేకరించిన డేటాను డిలీట్ చేయాలని కోరే హక్కు వినియోగదారులకు రానుంది. డేటా ఉల్లంఘనకు పాల్పడితే సదరు సంస్థలపై రూ. 250 కోట్ల వరకు జరిమానా విధించే ప్రతిపాదనను ఈ ముసాయిదాలో కేంద్ర ప్రభుత్వం పొందుపరిచింది.

ఏప్రిల్‌లో జాతీయస్థాయి నాటికల పోటీలు

యడ్లపాడు: పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం జాతీయస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు ఈ ఏడాది ఏప్రిల్ 4,5,6 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన నివాసంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. సురేష్‌బాబు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య పేరిట ప్రతి సంవత్సరం యడ్లపాడులో పండగ వాతావరణంలో నిర్వహించడం దశాబ్దాల నుంచి ఆనవాయితీగా వస్తుందన్నారు. ఏప్రిల్ మాసంలో నిర్వహించేందుకు సన్నహాలు చేస్తున్నామన్నారు. పోటీల నిర్వహణ ప్రతిసారీ విభిన్న తరహాలో నిర్వహించాలనే సంకల్పంతో కమిటీ సభ్యులు ఉన్నట్లు వెల్లడించారు. త్వరలోనే నాటికల స్క్రూటీన్లు చేసి ఉత్తమోత్తమ వాటిని తమ వేదికపై ప్రదర్శించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంస్థ కార్యదర్శి ముత్తవరపు రామారావు, పోపూరి నాగేశ్వరరావు ఉన్నారు.

బీమా ప్రీమియంపై జీఎస్టీ రద్దుకు డిమాండ్



మాట్లాడుతున్న వీవీకే సురేష్

కొరిటిపాడు(గుంటూరు): బీమా ప్రీమియంపై కేంద్ర ప్రభుత్వం 18 శాతం జీఎస్టీని వెంటనే ఉపసంహరించాలని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి వీవీకే సురేష్ డిమాండ్ చేశారు. గుంటూరు అరండల్‌పేటలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీ విధించడం వల్ల కోట్లాది మంది ఈ సౌకర్యాన్ని పొందలేకపోతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని ఎత్తివేయని పక్షంలో ఏజెంట్స్, పాలసీదారుల సహకారంతో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీమా రంగాన్ని మరింత శక్తిమంతం చేస్తే జీడీపీలో ప్రీమియం వాటా పెరుగుతుందని చెప్పారు. ప్రీమియంలపై విధిస్తున్న జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 300 మందికిపైగా ఎంపీలు, అనేక మంది కేంద్ర మంత్రులను కలసి వినతిపత్రాలను అందజేసినట్లు తెలిపారు. అసోసియేషన్ నాయకులు జానీ మాట్లాడుతూ ప్రజాసంక్షేమానికి ఎల్ఐసీ అంకితమైందని స్పష్టం చేశారు. అసోసియేషన్ నాయకురాలు సీహెచ్ మధుబాల మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బీమా రంగంలో విదేశీ వాటాను వంద శాతానికి పెంచాలని నిర్ణయించిందని అన్నారు. ఎల్ఐసీని కాపాడుకునేందుకు ఉద్యోగులు, ఏజంట్లు పోరాటం కొనసాగిస్తారన్నారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు నాగేంద్రరెడ్డి, గోపాలకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఏ విద్యార్థి ఆత్మహత్య



నాగప్రసాద్ మృతదేహం

లక్ష్మీపురం: హాస్టల్‌లో సీఏ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా గూడూరు ప్రాంతానికి చెందిన ప్రభాకర్‌రాజు ఉపాధ్యాయుడు. ఆయన కుమారుడు కె.నాగప్రసాద్ (27) బ్రాడీపేటలోని లోటస్ ప్రైమ్ బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. సీఏ చేస్తున్నాడు. శనివారం రాత్రి 9 గంటలకు నాగప్రసాద్‌తో రూమ్‌లో ఉండే మరో విద్యార్థి వచ్చి గది తలుపులు వేసి ఉండటంతో పిలిచాడు. అతడు పలకలేదు. దీంతో స్నేహితుడి రూమ్‌కు వెళ్లాడు. మరునాడు మధ్యాహ్నం అనుమానం వచ్చి హాస్టల్ నిర్వాహకులకు తెలియజేశాడు. వారు వచ్చి చూసేసరికి నాగప్రసాద్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సావిత్రిబాయి పూలే పురస్కారాలు ప్రదానం



కన్న మాస్టర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, నాగయ్య తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉత్తమ బోధకులకు సావిత్రిబాయి పూలే జాతీయ ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. సదరన్ ప్రైవేటు లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్పీఎల్‌టీఓ) ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు మార్కెట్ సెంటర్‌లోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎస్పీఎల్‌టీవో వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీ, తెలంగాణలకు చెందిన 181 మంది పురస్కారాలను అందుకున్నారు. మలినేని విద్యాసంస్థల చైర్మన్ మలినేని పెరుమాళ్లు, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ అంగలకుదురు గాయత్రీదేవి, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు, బయోటెక్నాలజీ ప్రొఫెసర్ కె.వసుంధరలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏఎన్‌యూ పాలకవవర్గ సభ్యుడు, కన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.కన్న మాస్టరు, అపుస్మా సంయుక్త కోశాధికారి కాటూరి వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ.. మహిళా విద్య కోసం సావిత్రిబాయి పూలే చేసిన కృషిని కొనియాడారు. ఏసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజెస్, ఏసీ న్యాయ కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి.రాణి అమృత వర్షిణి, లాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ప్రిన్సిపల్ అమీనాబేగం, ఆర్గనైజేషన్ కార్యనిర్వాహక అధ్యక్షులు కె.గోవిందరాజులు, కొండపల్లి విల్సన్, కన్వీనర్ పీఆర్ రత్నకుమార్, ఎన్‌వీఎస్ రఘు ప్రదీప్, కార్యదర్శి ఎం. రాకేష్, పీఎస్ ఆదిత్య, మహిళా సమన్వయకర్త డి.నాగమణి, కన్వీనర్ ఎస్పీ రసూల్ తదితరులు పాల్గొన్నారు.


రైలు ఎక్కుతూ కిందపడి వ్యక్తి మృతి



ఏడుకొండలు (ఫైల్)

రెంటచింతల: స్థానిక రైల్వేస్టేషన్లో రైలు ఎక్కుతూ ఓ వ్యక్తి కిందపడి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం ఉదయం జరిగింది. మండలంలోని పాత పాలువాయి గ్రామానికి చెందిన తమ్మిశెట్టి ఏడుకొండలు(46) ఈ ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. గుంటూరులో చదువుతున్న ఏడుకొండలు కొడుకు శ్యామ్, కుమార్తె శ్రావణి సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చారు. వారితో కలిసి గుంటూరు వెళ్లేందుకు రెంటచింతలలో రైలు ఎక్కుతున్న సమయంలో కాలుజారి ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతిచెందాడు. అధిక సంఖ్యలో ప్రయాణికులు ఒక్కసారిగా రైలు ఎక్కేందుకు యత్నించడం వలన ఈ ప్రమాదం జరిగినట్లు కొందరు ప్రయాణికులు తెలిపారు. విషయం తెలుసుకున్న రైల్వే ఎస్ఐ వెంకట్రావ్, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పంచనామ నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఏడు కొండలు గ్రామంలో ముఠామేస్త్రీగా పని చేస్తుంటాడు. మృతునికి భార్య పద్మ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

కృష్ణానదిలో యువకుడు గల్లంతు



చాట్ల బాలు (ఫైల్)

తాడేపల్లి రూరల్ : కృష్ణానది నీటిలో ఓ యువకుడు ఆదివారం గల్లంతయ్యాడు. కృష్ణానది ఎగువ ప్రాంతంలోని ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. విశాఖ జిల్లా భీమునిపట్నం, నేరెళ్లవలసకు చెందిన చాట్ల బాలు (18) కుటుంబం విజయవాడకు వచ్చి కూలీ పనులు చేసుకుంటోంది. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో ఈతకని వచ్చి నీటిలోకి దిగారు. బాలు మునిగిపోవడంతో స్నేహితులు కేకలు వేశారు. చుట్టుపక్కల వారు వెతికినా ప్రయోజనం కనిపించలేదు. తాడేపల్లి పోలీసులు, మంగళగిరి అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. అతడి బంధువులు, స్నేహితులు నది వద్దకు వచ్చి బాలు ఆచూకీ కోసం ఎదురు చూశారు.

తైక్వాండో పోటీల్లో 24 మందికి పతకాలు



పతకాలు అందుకున్న విద్యార్థులతో కోచ్ శ్రీనివాసరావు

తెనాలి అర్బన్: తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో తెనాలికి చెందిన కేఎస్ఆర్ తైక్వాండో అకాడమీకి చెందిన 23 మందికి పతకాలు లభించాయి. ఈ మేరకు కోచ్ కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. వీరిలో 10 మందికి బంగారు, తొమ్మిది మందికి వెండి, ఐదుగురికి కాంస్య పతకాలు లభించినట్లు చెప్పారు. పోటీలను బాపట్ల జిల్లా రేపల్లెలోని శ్రీవాసవీ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఈ నెల 11, 12వ తేదీలలో నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు పతకాలను ఆదివారం అకాడమీలో అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో వీరవల్లి మురళి, సర్పంచ్ కె.నాగభూషణం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఈ-ట్రాక్టర్లతో రైతులకెంతో మేలు



ట్రాక్టర్ నడిపి షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

పెదకాకాని: తక్కువ నిర్వహణ ఖర్చుతో ఎక్కువ కాలం సేవలందించే ఎలక్ట్రికల్ ట్రాక్టర్లతో రైతులకెంతో మేలు అని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. దేశంలోనే తొలిసారిగా ఎలక్ట్రికల్ ట్రాక్టర్‌ను మురుగన్ గ్రూప్ ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. గుంటూరు నగరంలోని ఆటోనగర్‌లో ఆదివారం ఎలక్ట్రికల్ ట్రాక్టర్‌ను మంత్రి స్వయంగా నడిపి ఎషోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. డీజిల్, పెట్రోల్ వాహనాల వినియోగాన్ని క్రమంగా తగ్గిస్తూ ప్రజలు ఎలక్ట్రికల్ వాహనాల వైపు దృష్టి సారిస్తున్నారని చెప్పారు. వ్యవసాయ పనుల నిర్వహణకు ఈ–ట్రాక్టర్లను రైతులు ఉపయోగించుకోవచ్చన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఎలక్ట్రికల్ ట్రాక్టర్లను తీసుకువచ్చే దిశగా ఆలోచన చేస్తామన్నారు. రైతులకు సబ్సిడీపై ఈ–ట్రాక్టర్లు అందుబాటులోకి వచ్చే విధంగా ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో చార్జింగ్ స్టేషన్‌లు అందుబాటులోకి తెచ్చేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్ వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో మురుగన్ గ్రూప్ సీఈఓ కె.హరిచంద్ర ప్రసాద్, గుంటూరు(తూర్పు) ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ గుంటూరు జిల్లాలో శ్రీ భ్రమరాంబపురం కాలనీ & జనచైతన్య ప్లాట్స్ & UDA అప్రూవ్డ్ ప్లాట్స్ & పొలములు. అ/కొ. స్పాట్ రిజిస్ట్రేషన్. మన్నెం లతీష్ గౌడ్. Ph: 9848986831

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 83338 33368

WANTED

■ స్టోర్‌కీపర్స్ కావలెను. అర్హతలు: ఒకటి లేదా రెండు సంవత్సరాలు మెస్‌లో కానీ ఇతర ఏదైనా స్టోర్స్‌లో పనిచేసిన అనుభవం కలిగి ఉండాలి. విద్యా అర్హత: బి.కాం. జీతము: 15000/- జీతంతో పాటు ఉచిత వసతి మరియు భోజనం కలదు. పనిచేయు స్థలం: గుంటూరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 89784 80429

■ గర్ల్స్ హాస్టల్‌లో పనిచేయుటకు ఫిమేల్ హాస్టల్ ఇన్‌చార్జీలు కావలెను. అర్హత: ఇంటర్/డిగ్రీ చదివి ఉండవలెను. జీతం: 12000/- ఇవ్వబడును. వయస్సు: 23 సం॥ల పైన ఉండవలెను. భోజనం మరియు వసతి కల్పించబడును. పనిచేయు స్థలం: గుంటూరు మాస్టర్‌మైండ్స్. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 91000 24059

■ కోటప్పకొండ దగ్గర గల గ్రానైట్ ఫ్యాక్టరీ నందు అనుభవం కలిగిన అకౌంటెంట్ కావలెను. మంచిజీతం. సంప్ర: 6305122366

■ గుంటూరు నందు ఒక గృహములో కుక్కలను చూసుకొనుటకు, ఇంటిలో పనిచేయుటకు భార్య భర్త కావలెను. వయస్సు 25సం॥ల నుండి 40సం॥ల లోపు రూము ఇవ్వబడును. ✆ 8500482999

■ ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీలు పురుషులు కావలెను. అర్హత: 10th– డిగ్రీ, ఆకర్షణీయమైన జీతం, వర్క్‌ఫ్రంహోం అవకాశం కల్పించబడును. 9019041491, 7975935948

■ విశ్రాంత ఉద్యోగులకు శుభవార్త! గుంటూరు నగరంలోని ప్రముఖ Bank అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు 10th పాస్ 50 సం॥ పై వయస్సు వారు కావలెను. సంప్ర: 75697 01056

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ : 18K. Ph: 9160900024, 9640400073.

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ఎడిషన్ రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిజనిజాలు పరిశీలించుకుని ఏర్పాట్లు నిర్ధారించుకోవాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.